క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



తెనాలి రూరల్: తెనాలి చెంచుపేటలోని ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. 45 రోజులపాటు సాగిన శిబిరంలో చిత్రలేఖనం, చేతిరాత, చదరంగంపై శిక్షణ ఇచ్చారు. శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ ఇచ్చిన జి. పృథ్వి, శివచరణ్, నాగవరపు సాయికృష్ణ, లలితాదేవిలను తల్లిదండ్రులు అభినందించారు.

మున్సిపల్ ఉద్యోగి మృతి



శివనాగేశ్వరరావు (ఫైల్)

తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో హెల్త్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వై.శివనాగేశ్వరరావు (53) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం ఆయన వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంపై మంగళగిరి వెళ్లారు. అక్కడి నుంచి వస్తుండగా మార్గం మధ్యలో గుండెపోటు రావడంతో రోడ్డుపై కుప్పకూలారు. గమనించిన స్థానికులు మంగళగిరిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. ఆయన భౌతికకాయాన్ని ఐతానగర్‌లోని స్వగృహానికి తరలించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఒంగోలు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, తెనాలి కమిషనర్ బండి శేషన్నలు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఆంధ్రాప్యారిస్ మున్సిపల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సంతాపం ప్రకటించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి



తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 20 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలాన్ని తెనాలి జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా స్వామి కల్యాణం



నగరంపాలెం: బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని శ్రీ గౌరీవిశ్వేశ్వరాలయంలో స్వామి జన్మ నక్షత్రం పురస్కరించుకుని శనివారం కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా అలకరించి, విశేష పూజలు చేశారు. దినేష్ రాఘవేంద్ర, జ్యోత్స్న దంపతులతో అర్చకులు విశ్వేశ్వరశర్మ కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమాల్ని ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశర్మ, మల్లికార్జునశర్మ పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జంపని కాల్వలో పూడికతీత ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: 11వ వార్డులోని జంపని పంట కాల్వలో పూడికతీత పనులు శనివారం ప్రారంభమయ్యాయి. జేసీబీతో వ్యర్థాల్ని తొలగించారు. పనుల్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వార్డులోని పలు కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ పంట కాల్వలు వ్యర్థాలతో పూడుకుపోవడం వల్ల రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాటిని తొలగించి ఇబ్బంది కలుగకుండా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ సుబ్బారావు, ఏఈ చైతన్య, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రామోజీ మృతి పత్రికా రంగానికి తీరని లోటు

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్



సభలో మాట్లాడుతున్న డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి

తెనాలి: మీడియా మొగల్ రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ శనివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. నమ్మిన విలువలు, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాపక్షం వహిస్తూ మీడియా ప్రపంచంలో ఆయన సాగించిన ప్రయాణం అసామాన్యమైనదని తెలిపారు. మీడియాకు సామాజిక బాధ్యత ఉందని బలంగా చాటారని పేర్కొన్నారు. సారా వ్యతిరేక ఉద్యమం, సమాచార హక్కు చట్టం, జల సంరక్షణతో సహా పలు సామాజిక అంశాలపై ప్రజా చైతన్యం తీసుకువచ్చారని వివరించారు. ఒక రైతు కుటుంబం నుంచి వచ్చి మీడియా రంగంలోనే కాకుండా సినీ నిర్మాతగా, అంతర్జాతీయ ప్రమాణాలతో స్టూడియో వ్యవస్థాపకులుగా, వాణిజ్యవేత్తగా ఆయన సాధించిన విజయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటని, రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రామోజీరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తెలుగు ప్రజలకు మార్గదర్శి

తెనాలి: ప్రముఖ పత్రికాధిపతి, పారిశ్రామికవేత్త చెరుకూరి రామోజీరావు తెలుగు ప్రజలకు మార్గదర్శకుల్లో ఒకరని శనివారం సాయంత్రం జరిగిన సంతాపసభలో వక్తలు నివాళులర్పించారు. నిబద్ధత, నిజాయతీకి ఆయన నిలువెత్తు దర్పణమని పేర్కొన్నారు. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. సామాన్య రైతుకుటుంబంలో జన్మించిన రామోజీరావు స్వయంశక్తితో తెలుగు ప్రజల మార్గదర్శకుడిగా ఎదిగారని ఆయన చెప్పారు. పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరప్రసాద్ మాట్లాడుతూ కాలేజీ రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న తాను, ఆ కాలేజీ పూర్వ విద్యార్థి అయిన రామోజీరావు చేతులమీదుగా బహుమతిని అందుకున్నానని చెప్పారు. కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో వివిధ రంగాల ప్రముఖులు డి.వి. సోమయ్యశాస్త్రి, మొవ్వా సత్యనారాయణ, గుత్తా వెంకటరత్నం, శాఖమూరి మల్లికార్జునరావు, అలపర్తి వెంకటేశ్వరరావు, ఈదర వెంకటపూర్ణచంద్, కొసరాజు వెంకట్రావు, పాలడుగు ఆనందయ్య, ఎస్.రామారావు, రత్తయ్య, చింపయ్య, దేవిశెట్టి కృష్ణారావు, నల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మీడియా దిగ్గజం రామోజీరావు

తెనాలి రూరల్: తెలుగు మీడియా రంగంలో కొత్త ఒరవడి సృష్టించిన దిగ్గజం రామోజీరావు అని సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. ఆయన మరణం మీడియా రంగంతో పాటు సినీ రంగానికీ తీరని లోటని పేర్కొన్నారు. రామోజీరావు సంతాప సభను స్థానిక మా ఏపీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్‌రాజా మాట్లాడుతూ తెలుగు పత్రికా రంగాన్ని రామోజీరావు అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మా-ఏపీ తరఫున ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నిర్మాత చదలవాడ హరిబాబు, సహాయ దర్శకుడు వెంకీ రావణ్, నటులు వేమూరి విజయభాస్కర్, ఇంటూరి విజయభాస్కర్, మన్నె సత్యనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

దార్శనికుడు రామోజీరావు

తెనాలి: తెలుగు భాషకు కొత్త ఊపిరిపోసి పత్రికా రంగాన్ని సరికొత్తగా మలిచిన మార్గదర్శి రామోజీరావు మృతి తీరని లోటని ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి, వ్యాపార రంగాన్ని ఖండాంతరాలు దాటించి తెలుగువారి ఉనికిని ఉన్నతంగా నిలబెట్టిన దార్శనికుడని రామోజీరావుకు నివాళి అర్పించారు.

ఔషధ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు ఫార్మసీ పట్టభద్రులు ఈ రంగంలో ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని ఎస్‌బీఐ ఇన్స్యూరెన్స్ మాడ్యూల్ మేనేజర్ ఎం. రవికుమార్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం బహుళజాతి ఔషధ సంస్థలతో పాటు స్వదేశీ ఔషధ రంగంలో నూతన వ్యవస్థాపకతలకు సంబంధించిన అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ ఫార్మసీ నిపుణులకు ఔషధ తయారీ, పంపిణీ, పరిశోధనలు, కమ్యూనిటీ ఫార్మసీ వంటి రంగాల్లో గల ఉపాధి అవకాశాలు గురించి వివరించారు. ఔషధ రంగంలో నూతన పెట్టుబడులకు ప్రభుత్వ రంగ బ్యాంకులు అందించే రుణ సదుపాయం, ప్రోత్సాహకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రత్యూష, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ కో-ఆర్డినేటర్ సీహెచ్. ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గజల్ సంపుటాల ఆవిష్కరణ

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (మహిళా విభాగం), రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సుప్రసిద్ధ గజల్ రచయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన సంపుటాల ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు డాక్టర్ తూనుగుంట్ల రాధాబాయి, డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సభ జరగనున్నట్లు పేర్కొన్నారు గజల్ ప్రియులు, సంగీత అభిమానులు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

తాళ్లాయపాలెం శైవ క్షేత్రంలో వెండి పాదుకలు చోరీ



తాడికొండ: తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వెండి పాదుకలను చోరీ చేశారు. సుమారు రెండున్నర కేజీల వెండి పాదుకలు చోరీకి గురవడంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ శైవక్షేత్రానికి చేరుకొని ఘటనపై పీఠాధిపతి శ్రీ శివస్వామిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకోవాలని సీఐను ఆదేశించారు. శ్రావణ్ కుమార్ వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు పునీత ఆంథోని పుణ్యక్షేత్ర వార్షికోత్సవం ప్రారంభం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫాదర్లు, కౌన్సిల్ సభ్యులు

నెహ్రూనగర్: పునీత ఆంథోని పుణ్యక్షేత్ర వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు కోరారు. నగరంపాలెంలోని పుణ్యక్షేత్రంలో శనివారం వేడుకల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 ఏళ్లగా వైభవంగా వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు పుణ్యక్షేత్రంలో వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు మేత్రాశనం పీఠాధిపతి బిషపత్ చిన్నాబత్తిన భాగ్యయ్య పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సహాయ గురువు ఫాదర్ రాజేష్, కౌన్సిల్ సభ్యులు ఎన్.జి.ప్రకాష్‌రావు, జె.సుధీర్, యలవర్తిసుదర్శన్, రాజేంద్రప్రసాద్, ఎం.ప్రకాష్‌రావు, దేవస్వామి, మరియదాసు, శాంతయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ హనుమత్ గాయత్రి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్లోని సువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వార్షిక శ్రీ హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం శ్రీహనుమత్ గాయత్రి హోమం, 108 సార్లు చాలీసా పారాయణలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సాయత్రం స్వామికి పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. వైదిక క్రతువును ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి, కిరణ్, సురేష్, వైఖానస పండితులు నాగమారుతి ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథశర్మ సుందరకాండ విశిష్టతను వివరించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 11వ తేదీ వరకు వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు 108 సార్లు చాలీసా పారాయణ, స్వామికి విశేష పూజాధికాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకోవాలని ఆయన కోరారు. 108 సార్లు చాలీసా పారాయణ చేసిన భక్తులకు ఆలయంలోనే అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, గుంటి వెంకట్, దమ్మాల వెంకటేశ్వరరావు, ఆర్. సురేష్, ఎం. వెంకటేష్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయుడికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



అభిషేకాలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో జీవధ్వజ ప్రతిష్ట 7వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణాచార్యులు, చంద్రాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ముఖమండపంలో విశ్వక్సేన తదితర పూజలు చేశారు. సాయంత్రం పరవస్తు హనుమాన్‌సూరి బృంద సభ్యులచే హనుమాన్ చాలీసా పారాయణం, కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యానీ గ్రేస్

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యురాలు యానీగ్రేస్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 294 మందికి వైద్యురాలు యానీ గ్రేస్ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ఇంటి చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తాగునీరు వడకట్టి తాగాలని చెప్పారు. మురుగు కాలవలలో నీటి పారుదల సక్రమంగా ఉంచుకోవాలని, తొట్లలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. దాని ద్వారా మలేరియా, డెంగీ జ్వరాలకు కారణమయ్యే దోమల ఉత్పత్తి తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ కె.సుదర్శనరాజు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం ఏసమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో రహదారుల వెంట కంప తొలగింపు



జేసీబీలతో రోడ్ల వెంబడి కంపను తొలగిస్తున్న సీఆర్డీయే సిబ్బంది

తాడికొండ: తుళ్లూరు మండలంలో ప్రధాన రహదారుల వెంట పెరిగిన పిచ్చి కంపచెట్లు తొలగించే పనులను సీఆర్డీయే ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డు, తుళ్ళూరు నుంచి హైకోర్టు వెళ్లే రహదారి, రాయపూడి నుంచి హైకోర్టుకు వెళ్లే ప్రధాన రహదారితోపాటు పలు గ్రామాలకు వెళ్లే కనెక్టివిటీ రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి కంప తొలగింపు పనులను జేసీబీల సాయంతో చేస్తున్నారు. సీఆర్డీయే అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పనులకు వర్షాకాలం నేపథ్యంలో చిన్నపాటి ఆటంకాలు ఉన్నప్పటికీ రేయింబవళ్లు జరుగుతున్నాయి.

వైఎస్సార్ సీపీ వర్గీయులపై దాడులు అమానుషం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్



చెరుకుపల్లి: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ సానుభూతి పరులు దాడులు చేయటం తగదని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి శాంతి భద్రతలను పరిరక్షించాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి రాష్ట్రంలో కూటమి నాయకులు, కార్యకర్తలు విధ్వంస కాండకు పాల్పడటం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై భౌతిక దాడులకు పాల్పడటంతో పాటు ఆస్తులు ధ్వంసం చేయటం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకి అధికారం శాశ్వతం కాదని, ప్రజా తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఎన్నికలు ముగిసినందున పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్నేహ పూరిత వాతావరణంలో జీవించాలన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అండగా ఉంటానని హామీనిచ్చారు.

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత




విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న ఎంసీఏ సభ్యులు

రేపల్లెరూరల్: పరుచూరి రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీ నారాయణ కల్యాణ మండపంలో పలువురు ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు శనవారం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరుచూరి శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులకు తమ ట్రస్ట్ చేయూత నందిస్తుందన్నారు. పరుచూరి భావన్నారాయణ చౌదరి జ్ఞాపకార్థం ఎంసీఏ ఆధ్వర్యంలో రూ.3.50లక్షలు బ్యాంక్‌లో డిపాజిట్ చేసి ఆ నగదుపై వచ్చిన వడ్డీతో ప్రతి సంవత్సరం విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బీటెక్ విద్యార్థినులు చిరకాల వెంకట శ్రావ్య, వి.సుప్రియలకు ఒక్కొక్కరికీ రూ.10వేలు, గుమ్మడి నికిలేశ్వరికి రూ.5 వేలు చొప్పున నగదు అందజేశారు.

అవగాహనతోనే ప్రోస్టేట్ క్యాన్సర్‌కు చెక్

- మగవారికి మాత్రమే వచ్చే జబ్బు ఇది
- 50 సంత్సరాలు పైబడిన వారిలో ఎక్కువ
- ఆధునిక వైద్యసేవలతో వ్యాధి నయం
- ప్రాథమిక దశలో చికిత్స సులువు



ప్రోస్టేట్ గ్రంథి

గుంటూరు మెడికల్: మగవారికి మాత్రమే వచ్చే వ్యాధుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటి. ఇది 50 సంత్సరాలు పైబడిన వారిలో వస్తుంది. సకాలంలో గుర్తించకపోతే శరీరంలోని ఇతర అవయవాలకు కూడా సోకే ప్రమాదం ఉంది. గుంటూరు జీజీహెచ్‌కు ప్రతినెలా 10 మంది ప్రోస్టేట్ క్యాన్సర్ సోకిన వారు చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో 20 మంది యూరాలజిస్టులు ఉండగా వారంలో ఒక్కొక్కరు కనీసం ఇద్దరిని గుర్తించి వైద్యసేవల్ని అందిస్తున్నారు. వ్యాధి సోకిన విషయం కూడా తెలియకుండానే ఇతర యూరాలజీ సమస్యలతో వైద్యం కోసం వెళ్లేవారిలో దీన్ని ఎక్కువగా గుర్తిస్తున్నారు. జీవితం అర్ధభాగంలో సంభవించే ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చు. ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వ్యాధి లక్షణాలు

ప్రోస్టేట్ గ్రంథి మగవారి మూత్రనాళం కిందట ఉంటుంది. ఇది వీర్య కణాల్ని మోసుకెళ్లే ద్రవ పదార్థాన్ని తయారు చేయడం, లైంగిక సంపర్కానికి దోహద పడుతుంది. సైలెంట్ కిల్లర్‌గా పిలువబడే ప్రోస్టేట్ క్యాన్సర్ సోకినట్లు తెలుసుకోవడానికి ఆలస్యమవుతోంది. వ్యాధి లక్షణాలు చాలా వరకు బయటపడకపోవడంతో నిర్ధారణ త్వరితగతిన జరగడం లేదు. అంగ స్తంభన కష్టంగా ఉండటం, వీర్య స్ఖలనం చేసే సమయంలో నొప్పి రావడం, వీర్యం తగ్గిపోవడం, దీర్ఘకాలికంగా వెన్నుముక నొప్పి, తరచూ మూత్ర విసర్జనకు వెళ్లడం, తొందరపాటు, అధికంగా వస్తున్నట్లు ఉండటం, విసర్జనకు చాలా సమయం తీసుకోవడం, మూత్రంలో రక్తం రావడం, రాత్రి నిద్రిస్తున్న సమయంలో మూత్ర విసర్జన వల్ల నిద్రాభంగం అవ్వడం, ఎముకలు నొప్పులు, కాళ్ల వాపులు, పొత్తికడుపు ఇబ్బందిగా ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ

క్యాన్సర్ రావడానికి నిర్దిష్ట కారణాలు తెలియవు. ఎర్రటి మాంసం, అధిక కొవ్వు శాతం ఉన్న ఉత్పత్తులు తీసుకునేవారిలో , శుభ్రం లేకుండా వండిన మాంసం ఎక్కువగా తినటం వల్ల వచ్చే అవకాశాలు ఉన్నాయి. 60 సంవత్సరాలు పైబడిన మగవారిలో ముగ్గురిలో ఇద్దరు దీని బారిన పడుతున్నారు. ప్రోస్టేట్ క్యాన్సర్‌ను సీరం పీఎస్‌ఏ పరీక్ష ద్వారా వస్తుందా.. లేదా ? అనే విషయాన్ని నిర్ధారించవచ్చు.

సకాలంలో గుర్తిస్తే నయం చేయవచ్చు



ప్రోస్టేట్ క్యాన్సర్ చాలా చిన్నగా పెరుగుతుంది. సకాలంలో గుర్తించి ఆపరేషన్ చేయటం వల్ల పూర్తిగా నయం చేయవచ్చు. ల్యాప్రోస్కోపిక్, రోబోటిక్ సర్జరీలతో కోత కుట్టు లేకుండా చేసే ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఒత్తిడి వల్ల క్యాన్సర్ పెరిగే ప్రమాదం ఉంది. యోగా, వ్యాయామం చేయడం మంచిది. క్రమం తప్పకుండా వేళకు భోజనం చేయడం, క్యాన్సర్‌ను చంపే ఆహారమైన క్యాబేజ్, క్యాలీఫ్లవర్, పచ్చని ఆకుకూరలు, చేపలు ఆహారంలో తీసుకోవడం చాలా మంచిది.

– డాక్టర్ పోలుమట్ల జ్ఞానప్రకాష్, యూరాలజిస్ట్, గుంటూరు